క్లుప్తంగా

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



బీఆర్‌ఎస్ నాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

నవాబుపేట: సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో నవాబుపేట బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో సీనియర్ నాయకులు మల్లారెడ్డి, వెంకట్‌రెడ్డి, ప్రభాకర్, ఆనంద్‌రెడ్డి, మాణెయ్య, మల్లేశం, యాదవరెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, మాజీ సర్పంచులు ఆర్ వెంకట్‌రెడ్డి, ఎండీ రఫి, దేవయ్య, తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఎంపీ రంజిత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ యాదవరెడ్డి, చేవెళ్ల ఇన్‌చార్జి భీంభరత్ నాయకులు ఉన్నారు.

వంశీచంద్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం



ఈర్లపల్లిలో ప్రచారం చేస్తున్న నాయకులు

దౌల్తాబాద్: పాలమూరు పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డికి మద్దతుగా బుధవారం మండలంలోని ఈర్లపల్లి, నందారం, దౌల్తాబాద్ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఇంటింటికి కాంగ్రెస్ శ్రేణులు వెళ్లి వంశీచందర్‌రెడ్డికి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శివారెడ్డి, కృష్ణారెడ్డి, హన్మంతు తదితరులున్నారు.

చదువులో గ్రామీణ ప్రాంత విద్యార్థులే మెరుగు

బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి



మమతను సన్మానిస్తున్న నాయకులు

యాలాల: గ్రామీణ ప్రాంతాల విద్యార్థులే చదువుల్లో మెరుగ్గా రాణిస్తున్నారని బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి అన్నారు. ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాల్లో తెలంగాణ బాలికల గురుకులంలో చదువుతున్న అన్నసాగర్ మాజీ సర్పంచ్ బోయిని సాయిలు కూతురు మమత మొదటి సంవత్సరంలో 440 మార్కులకు గాను, 436 మార్కులు సాధించింది. మమతను బుధవారం రవీందర్‌రెడ్డితో పాటు వైస్ ఎంపీపీ రమేష్‌లు అభినందించి సన్మానించారు. 95 శాతానికి పైగా మార్కులు సాధించడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో ఎంబీబీఎస్ చదవాలని కోరుకుంటున్న మమతకు పార్టీ పరంగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆయనతో పాటు ఏఎంసీ మాజీ డైరెక్టర్ కృష్ణకుమార్, లాలప్ప ముదిరాజ్ ఉన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

తాండూరు టౌన్: తాండూరు పట్టణంలోని విజయ విద్యాలయ ఉన్నత పాఠశాలలో 1985–86లో పదో తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు బుధవారం కలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను, చదువు నేర్పిన ఉపాధ్యాయులను గుర్తు చేసుకున్నారు. పాఠశాలలో విద్యనభ్యసించినందుకు గుర్తుగా రాబోయే విద్యా సంవత్సరంలో విద్యార్థులందరికీ రూ. 50 వేల విలువ గల దుస్తులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు జర్నలిస్టు శ్రీనివాసాచారి, విద్యుత ఏడీఈ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం

కాంగ్రెస్ యువనాయకుడు రితిక్‌రెడ్డి



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న నేతలు

పూడూరు: స్నేహపూరిత వాతావరణంలో క్రీడలు ఆడాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువ నాయకుడు రితిక్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని తిర్మలాపూర్‌లో డీసీసీ కార్యదర్శి పెంటయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌ను రంజిత్‌రెడ్డి తనయుడు సిద్ధార్థ రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. చిన్నప్పటి నుంచి పోటీ తత్వాన్ని అలవర్చుకున్నప్పుడే అన్ని రంగాల్లో రాణించవచ్చని అన్నారు. క్రీడాకారులకు తన ప్రోత్సాహం ఎల్లప్పుడు ఉంటుందన్నారు.

ఎర్రజెండా రెపరెపలు

మేడే సందర్భంగా బుధవారం వాడవాడలా ఎర్ర జెండాలు రెపరెపలాడాయి..కార్మికుల హక్కుల సాధన కోసం అమరులైన యోధులను స్మరించుకుంటూ జిల్లా వ్యాప్తంగా ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను సీఐటీయూ, కార్మిక, కర్షక, సంఘాల ఆధ్వర్యంలో జెండాలు ఆవిష్కరణ, బైక్ ర్యాలీలు నిర్వహించారు. పలు చోట్ల స్వీట్లు పంచి పెట్టారు. కార్మికుల హక్కులు, చట్టాలను ప్రభుత్వాలు పక్కాగా అమలు చేయాలని నినదించారు.



తాండూరు టౌన్‌లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మేడే వేడుకలు



బొంరాస్‌పేట: కార్మిక జెండాను ఎగురవేస్తున్న సీఐటీయూ నాయకుడు బుస్స చంద్రయ్య



వికారాబాద్‌లోని విద్యుత్ కార్యాలయం ఎదుట..



కుల్కచర్ల: మందిపల్ గ్రామంలో పంచాయతీ కార్మికులను సన్మానించిన నేతలు



పరిగిలో జెండాను ఎగరవేస్తున్న సీపీఎం నాయకులు



కొడంగల్ : జెండా ఎగురవేస్తున్న సీపీఐ నాయకులు



మోమిన్‌పేటలో జెండావిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు



అనంతగిరి: వికారాబాద్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ



మర్పల్లి: మాట్లాడుతున్న సబ్‌స్టేషన్ కార్మికులు



పరిగి: ఎన్నికల ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

ఆ రెండు పార్టీలు మోసం చేశాయి

మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి: రాష్ట్రంలో కాంగ్రెస్ , దేశంలో బీజేపీ, ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేశారని రెండు పార్టీలను ప్రజలు నమ్మె పరిస్థితిలో లేరని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని రాపోల్, సయ్యాద్‌పల్లి, కాళ్లాపూర్ తదితర గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించి కారుగుర్తుకు ఓటు వేసి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఏ ఇల్లు తట్టిన కేసీఆర్ పాలనను గుర్తు చేసుకుంటున్నారన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేసి ఎంతో తప్పు చేశామని ప్రజలు ఆవేదన చెందుతున్నారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రాష్ట్రంలో మళ్లీ కేసీఆర్ పాలనలను కోరుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుందఅశోక్‌కుమార్, ఎంపీపీ అరవింద్‌రావు, జెడ్పీటీసీ హరిప్రియ, మండల పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు, సీనియర్ నాయకులు ప్రవీణ్‌రెడ్డి,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, రవికుమార్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మోసపూరిత మాటలు నమ్మొద్దు

యాలాల: కాంగ్రెస్ మోసపూరిత మాటలు నమ్మొద్దని, బీజేపీకి మత రాజకీయాలు తప్ప అభివృద్ధి తెలియని తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి విమర్శించారు. బుధవారం బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ తరఫున యాలాల మండలంలో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు ఓటేసి మోసపోయారన్నారు. రూ. 2లక్షల రుణమాఫీ, రూ.4 వేల పింఛను, కరెంటు సమస్యలు, కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్ తదితర సంక్షేమ పథకాలకు ప్రజలు దూరమయ్యారన్నారు. బీసీల కోసం తన జీవితాన్ని కాసాని జ్ఞానేశ్వర్ త్యాగం చేశారని, ఎంపీ ఎన్నికల్లో బీసీలంతా ఏకమై కాసానిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆగస్టు 15లోగా కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల రూ.2లక్షల రుణమాఫీని ఏకకాలంలో చేయకపోతే తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి రాజీనామా చేయడానికి సిద్ధమా అంటూ ప్రశ్నించారు. కాంగ్రెస్ సర్కారు ఆరు గ్యారంటీలంటూ ఒక్కటి కూడా సరిగ్గా అమలు చేయలేదని విమర్శించారు. కోకట్, బాగాయిపల్లి, యాలాల తదితర గ్రామాల్లో కార్నర్ మీటింగ్‌ల్లో రోహిత్‌రెడ్డి పాల్గొని ప్రచారం చేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ విఠల్‌నాయక్, సొసైటీ వైస్ చైర్మన్ వడ్డే రాములు, వైస్ ఎంపీపీ రమేష్, ఏఎంసీ మాజీ డైరెక్టర్లు మహ్మద్ ముస్తఫా, మంత్రి వెంకటయ్య, మాజీ సర్పంచ్‌లు మిత్రునాయక్, వెంకటయ్య, సాయిలు, క్రిష్ణయ్యగౌడ్, బిచ్చన్నగౌడ్, నాయకులు ఉన్నారు.

కాసానిని గెలిపిద్దాం

అనంతగిరి: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఎంతో కృషి చేసిన బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ కోరారు. ఈ మేరకు వికారాబాద్ మున్సిపల్‌లోని జాంబాపూర్ తండాలో బుధవారం ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీకి అండగా ఉండాలన్నారు. కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకువచ్చారన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను విస్మరిస్తుందన్నారు. ఎన్నికల్లో ప్రజలే తగిన సమాధానం చెబుతారన్నారు. కార్యక్రమంలో నాయకులు అనంతయ్య, చందర్, శ్రీనివాస్, గోవర్ధన్, రవి, హన్మంతు, యాదయ్య, శివయ్య పాల్గొన్నారు.

ప్రధాని మోదీతోనే దేశాభివృద్ధి



మోమిన్‌పేట: ప్రచారం చేస్తున్న లక్ష్మారెడ్డి

బీజేపీ మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి

మోమిన్‌పేట: దేశాభివృద్ధి మోదీతోనే సాధ్యమని మండల బీజేపీ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని గోవిందాపూర్, చక్రంపల్లి గ్రామాల్లో పార్టీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ ఫలాలు ప్రతి ఇంటికి అందాయన్నారు. దేశంలో గత 10 సంవత్సరాల నుంచి ఎక్కడ బాంబుల మోత వినిపించడం లేదన్నారు. కేవలం మోదీ తీసుకొనే కఠినమైన నిర్ణయాల వల్లే ఉగ్రవాదులు కన్పించడం లేదన్నారు. పేదలకు గత ఐదు సంవత్సరాలుగా వచ్చే ఉచితంగా రేషన్ సరఫరా, అయుష్మాన్ భారత్, నిరుద్యోగులకు ముద్రరుణాలు మోదీతోనే సాధ్యమన్నారు. మళ్లీ దేశంలో మోదీ ప్రభుత్వం రావాలంటే కమలం గుర్తుకు ఓటు వేయాలి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలోజిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు మహిపాల్, బీజేవైఎం అధ్యక్షుడు అశిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి రాఘువేందర్‌రెడ్డి, కార్యదర్శి నర్సింహ్మారెడ్డి, నాయకులు రాఘునాథ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, భానుప్రకాశ్, మల్లేశం ,వెంకట్, భూపాల్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

పర్సాపూర్‌లో..

కొడంగల్: మండలంలోని పర్సాపూర్‌లో బుధవారం బీజేపీ జిల్లా కార్యదర్శి సూరారం రాకేశ్, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు గంటి సర్వేశ్వర్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలను కలిసి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. నరేంద్ర మోదీ మరోసారి ప్రధాన మంత్రి అయితేనే దేశం సుభిక్షంగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా నాయకుడు శ్రీశైలం, బీజేవైఎం మండల కమిటీ అధ్యక్షుడు రామకృష్ణ పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన వీరశైవ సమాజ సభ్యులు

తాండూరు టౌన్: తాండూరు వీరశైవ సమాజం ఆత్మీయ సమ్మేళనంలో బుధవారం చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమాజ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం వీరశైవ సమాజం అధ్యక్షుడు బస్వరాజ్‌తో పాటు 200 మంది సమాజ సభ్యులు బీజేపీలో చేరారు. వారికి కాషాయ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. వీరశైవ సమాజ స్థాపకుడు బసవేశ్వరుని ఆశయాలు ఆదర్శనీయమన్నారు. సమాజంలో మార్పు కోసం, ప్రతి ఒక్కరూ సేవా మార్గంలో పయనించాలని పిలుపునిచ్చారన్నారు.

బీఆర్‌ఎస్‌కు షాక్

బీజేపీలో చేరిన ఎంపీటీసీ, మాజీ సర్పంచు

తాండూరు రూరల్: తాండూరు మండలంలో బీఆర్‌ఎస్‌కు షాక్ తగిలింది. గోనూర్ ఎంపీటీసీ నర్సమ్మ, మాజీ సర్పంచు గోవింద్‌లు ఆ పార్టీకి రాజీనామా చేసి బుధవారం బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ పని అయిపోయిందన్నారు. ప్రజలు కేసీఆర్‌ను నమ్మడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీల అమలులో విఫలమయిందని విమర్శించారు. గోనూర్, వీరిశెట్టిపల్లికి చెందిన ఎర్ర శ్రీనివాస్, రాజు, భీంరెడ్డి, రాంరెడ్డి , నర్సింహ, పరుశురాం, ఎర్ర శ్రీశైలం, చీమల హరి, శంకర్, పరుశురాం, మల్లప్ప, మల్లేశంలు బీజేపీలో చేరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమేశ్‌కుమార్, గౌతపూర్ ఎంపీటీసీ నరేందర్‌రెడ్డి, నాయకులు బొప్పి శ్రీహరిలు ఉన్నారు.



బీజేపీలో చేరిన ఎంపీటీసీ, సర్పంచుతో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

కాంగ్రెస్ నుంచి బీజేపీలోకి...

మండలంలోని చంద్రవంచ గ్రామంలో అధికార పార్టీ కాంగ్రెస్‌కు చెందిన విజయ్ కుమార్‌రెడ్డితో పాటు 100 మంది యువకులు విశ్వేశ్వర్ రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు.

ఉపాధిహామీ పనులతో లబ్ధి

ఎంపీడీఓ మహేశ్‌బాబు

దోమ: జాబ్‌కార్డు ఉన్న ప్రతి కూలీ ఉపాధిహామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ మహేశ్ బాబు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని గూడూర్, దొంగ ఎన్కేపల్లి గ్రామాల్లో ఉపాధిహామీ పనులను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద పని చేస్తున్న కూలీలకు కూలీ రేట్లను పెంచిందని తెలిపారు. రూ. 272 నుంచి రూ.300లకు పెంచిందని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాము, ఉపాధి హామీ కూలీలు, తదితరులు పాల్గొన్నారు.



కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

తాండూరు అభివృద్ధి బాధ్యత నాదే



తాండూరు రూరల్: కుండలు చేస్తూ ప్రచారం నిర్వహిస్తున్న మనోహర్‌రెడ్డి



కుల్కచర్ల: ఉపాధికూలీలను ఓటు వేయాలని కోరుతున్న సత్యహరిశ్చంద్ర

ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు రూరల్: తాండూరు నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతో ఎమ్మెల్యేగా గెలిచానని.. కావునా తాండూరు అభివృద్ధి బాధ్యత నాదేనని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. బుధవారం తాండూరు మండలం దస్తగిరిపేట్‌లో పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీని బొందపెట్టామన్నారు. కేసీఆర్ పది సంవత్సరాల పాలనలో ప్రజలు విసుగు చెంది కాంగ్రెస్‌ను ఆదరించారని అన్నారు. మతతత్వపార్టీ బీజేపీ ఉచ్చులో యువకులు పడొద్దని సూచించారు. పది సంవత్సరాల బీజేపీ పాలనలో దేశం ఏం అభివృద్ధి చెందిందని ప్రశ్నించారు. పేదల సంక్షేమం కోసం కృషి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరారు. ఎంపీ ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటు వేసి రంజిత్‌రెడ్డిని గెలిపించాలని అభ్యర్థించారు. అనంతరం కుమ్మరుల ఇంటి వద్ద ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కుండలు చేశారు. కార్యక్రమంలో నాయకులు కరణం పురుషోత్తంరావు, శ్రీను, రవిగౌడ్, భగవన్ కరీం, పాండు, జంగం శ్రీనివాస్, అజయ్, దప్పు రాజు, ఆశన్న ఉన్నారు.

రంజిత్‌రెడ్డి గెలుపు ఖాయం

అనంతగిరి: చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా రంజిత్‌రెడ్డి గెలుపు ఖాయమని పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల అన్నారు. బుధవారం పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మద్గుల్ చిట్టంపల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఏ ఇంటికి వెళ్లిన ప్రజలు కాంగ్రెస్‌కే తమ మద్దతు చెబుతున్నారన్నారు. రంజిత్‌రెడ్డి గెలుపుతో ఈ ప్రాంతం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందన్నారు. అన్ని కులాలను, మతాలను కలుపుకొని పోయే పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సతీష్‌రెడ్డి, కౌన్సిలర్లు గ్రాయత్రి, స్వాతి, సీనియర్ నాయకులు ముత్తాహార్ షరీఫ్, చిగుళ్లపల్లి రమేష్‌కుమార్, వెంకటయ్య, మల్లయ్య బాదం అశోక్, తదితరులు పాల్గొన్నారు.

జోరుగా కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం

యాలాల: మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు జోరుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం ఉపాధి పనులు చేస్తున్న ప్రదేశాలకు వెళ్లి కాంగ్రెస్ మేనిఫెస్టోను కూలీలకు వివరించారు. మండలంలోని అన్నసాగర్, పగిడియాల, కమాల్‌పూర్, ముద్దాయిపేట, యాలాల, దేవనూరు, కోకట్ తదితర గ్రామాల్లో ప్రచారం చేపట్టారు. చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డికి ఓటేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నర్సింహులు, సత్యనారాయణరెడ్డి, రఘురాంరెడ్డి, నాగయ్య, ఖాసీం ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు మేలు

ఎంపీపీ సత్యహరిశ్చంద్ర

కుల్కచర్ల: కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని కుల్కచర్ల ఎంపీపీ సత్యహరిశ్చంద్ర అన్నారు. బుధవారం మండలంలోని ముజాహిద్‌పూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్ రెడ్డి తరఫున ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని పేర్కొన్నారు. కేంద్రంలో సైతం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుకానుందని, కావునా మన ఎంపీలు గెలవడం వల్ల మనకు మరిన్ని నిధులు వచ్చే ఆస్కారం ఉంటుందన్నారు. ప్రజలు ఆలోచించి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో కుల్కచర్ల మండల పార్టీ అధ్యక్షుడు అంజనేయులు తదితరులు పాల్గొన్నారు. అలాగే, చౌడాపూర్ మండల కేంద్రంలో మండల పార్టీ అధ్యక్షుడు అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రచారం నిర్వహించారు.

పార్లమెంటులోనూ హస్తమే కనిపించాలి

బొంరాస్‌పేట: బొంరాస్‌పేట, దుద్యాలల్లోని కాంగ్రెస్‌పార్టీ నేతలు ఇంటింటి ప్రచారంలో నిమగ్నమయ్యారు. బుధవారం ఏర్పుమళ్ల, మెట్లకుంట తదితర గ్రామాల్లో హస్తం నేతలు పార్లమెంటు ఎన్నికల ప్రచారాన్ని జోరుగా సాగించారు. రాష్ట్రంలో పదేళ్ల నిరంకుల పాలకు స్వస్తి పలికి రేవంత్‌రెడ్డిని సీఎం చేసినట్లు, పార్లమెంటలోనూ హస్తం కనిపించాలని మండల పార్టీ నాయకులు సీనియర్ జయకృష్ణ, వెంకట్రాములుగౌడ్ అన్నారు. ఇందులో మండల పార్టీ అధ్యక్షుడు నర్సింలుగౌడ్, నర్సింలు నాయుడు, అంజిల్‌రెడ్డి తదితరులున్నారు.

కాంగ్రెస్‌తోనే మేలు

అనంతగిరి: ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ తన స్వార్థం కోసమే బీజేపీకి అండగా ఉండాలంటున్నారని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాజు పేర్కొన్నారు. ఈమేరకు బుధవారం వికారాబాద్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాదిగలంతా బీజేపీకి ఓటు వేయమనడం సరికాదన్నారు. కాంగ్రెస్ పార్టీ మాదిగలకు ఎంతో మేలు చేసిందన్నారు. బీజేపీ మోసపూరిత పార్టీయన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. సమావేశంలో నాయకులు మల్లేశం, జంగయ్య, యాదగిరి, బుచ్చయ్య, నాగరాజు, ప్రమోద్ ఉన్నారు.

సంక్షేమం కావాలంటే కాంగ్రెస్‌ను గెలిపించాలి

మర్పల్లి: ఆరు గ్యారంటీలు అమలు కావాలంటే కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు గూడెం రాములు యాదవ్ ఓటర్లకు విజ్ఞప్తి చేశాడు. బుధవారం మండల పరిధిలోని కోట్‌మర్పల్లి, మర్పల్లి, సిరిపూరం, కల్‌ఖోడ గ్రామాల్లో పార్టీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డిని ఎంపీగా గెలిపిస్తే గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతాయన విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రచారంలో ఆయా గ్రామాల మాజీ సర్పంచ్‌లు సూనం పల్లి చంద్రయ్య, పాండునాయక్, శంకరయ్యగౌడ్, రాచన్న, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు నిఖిల్‌రెడ్డి, మండల నాయకులు రాచన్న, వెంకట్, గణేష్, ఆయా గ్రామాల పార్టీ అధ్యక్షుడు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ఓటు వేయాలి

దోమ: రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్‌కు ఓటు వేయాలని ఆ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శాంతుకుమార్ అన్నారు. బుధవారం దోమ మండల పరిధిలోని ఖమ్మనాచారం గ్రామంలో పార్లమెంట్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ప్రజలను మోసం చేసి కేవలం అధికార పార్టీ నేతలకే సంక్షేమ పథకాలను అందించిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి ఇంటికి సంక్షేమ పథకం అందించేలా చర్యలు తీసుకుంటుందన్నారు. రంజిత్‌రెడ్డిని అత్యాధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ రమేష్, ఎస్సీ సెల్ నాయకులు యాదయ్య, శ్రీశైలం, నర్సింహులు, వెంకటయ్య, అంజిలయ్య, రాములు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే ప్రగతి

ధారూరు: కాంగ్రెస్ పార్టీతోనే దేశం, రాష్ట్రంలో ప్రగతి సాధ్యమని ఆ పార్టీ నాయకులు ప్రజలకు సూచించారు. బుధవారం ధారూరు మండల కేంద్రంలోని వివిధ కాలనీల్లో కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అన్ని వర్గాల సంక్షేమానికి ఒక్క కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. రాష్ట్రంలో, దేశంలో ఒకే పార్టీ ఉంటే సత్వర అభివృద్ధి జరుగుతుందన్నారు. అనంతరం ఉపాధి కూలీ పనులు చేస్తున్న వారి వద్దకు వెళ్లిన వారు కాంగ్రెస్ గ్యారంటీలను వివరిస్తూ కరపత్రాలను అందజేశారు.